నమస్తే తెలంగాణ

# ప్రతి తల్లికి ఉత్తమ సంరక్షణ అందించడమే లక్ష్యం



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సీ. శ్రీనివాస్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్, ఎండీ ఎవిటా ఫెర్నాండెజ్

అబిడ్స్,డిసెంబర్ 4. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి తల్లికి ఉత్తమ సంరక్షణ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సీ. శ్రీనివాస్ అన్నారు. మాతా, నవజాత శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకుగాను బుధవారం పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీ సత్యసాయి హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ పరిశోధనా విభాగం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు శ్రీసత్యసాయి ట్రస్ట్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్ పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్‌లు ఎంవోయూలపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మనందరిదీ ఒకే లక్ష్యమని, వెనుకబడిన వర్గాల గర్భిణులు, నవజాత శిశువులు, కుటుంబాలకు ఉత్తమమైన సంరక్షణ అందించడమేనన్నారు. గర్భధారణ, ప్రసవ సమయం,ప్రసవానంతరంతో పాటు శిశువు జీవితంలోని ప్రారంభ వారాల వరకు ఈ సంరక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఎండీ ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడుతూ స్త్రీ కేంద్రీకృతమైన ప్రసవ పద్ధతులకు మార్గదర్శకత్వం వహించింది ఫెర్నాండెజ్ ఆసుపత్రి అని అన్నారు. గర్భధారణ,ప్రసవ విషయంలో మహిళలు స్వతహాగా నిర్ణయం తీసుకునే స్వేచ్ఛనిచ్చిందన్నారు. ప్రసవ సమయంలో అవసరమైన వైద్య జోక్యాలను తగ్గించడానికి మిడ్‌వైఫరీ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందన్నారు. మిడ్‌వైఫరీ ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాలని కోరుకుంటున్నామన్నారు.